# దురాశ కాటేసింది!

* రచన : శ్రీ బచ్చు వీర్రాజు *



(రచయిత)

అనాతవరంలో సుందర్రామయ్యగారంటే చాలా పెద్ద పేరు. ఆయన ఎక్కడ నుంచి వచ్చాడో, అతని పుట్టు పూర్వోత్తరాలేమిటో ఎవరికీ తెలియదు.

ప్రజలకు తెలిసిందల్లా ఆయన చేతికి ఎముక లేదన్న సంగతి ఒక్కటే. ఎక్కడ ఏ కార్యం జరిగినా, ఆయన హస్తం లేనిదే జరిగేది కాదు. బీదా బిక్కీ అనే భేదం లేకుండగా, ఆయన తన విరాళాలలో ప్రజల్ని సంతోష పెడ్తూ వుండేవాడు.

ఆయన వుండడానికి, ఓ అద్దాలమేడ, ఓ వంట మనిషి, ఓ కారు యివీ ఆయన తాలూకు కనబడే ఆస్థులు. ఆ మేడలో ఎక్కడా గాజుల శబ్దం వినబడేదికాదు. ఆయనతో కనబడేది కుమార్ అనబడే యిరవై అయిదేళ్ల వ్యక్తి మాత్రమే. ప్రజలందరికీ ఆ కుమార్ సుందర్రామయ్యగారి పుత్రరత్నంగానే తలచేవారు.

ఎక్కడెక్కడో ఆయనకు ఆస్థులుండి, దాని ద్వారా ఆయన జమీందారీ గిరి నిర్వహిస్తున్నట్లుగా వినికిడి.

X X X

పై సుందర్రామయ్యగారికి ప్రత్యర్థి నాగభూషణం అనే వ్యక్తి. పేరుకు తగ్గట్టు ఒళ్లంతా విషమే నాగభూషణానికి. చచ్చిన వాటిమీదకూడా సొమ్ము ఎలా సంపాదించాలా? అని అనుక్షణం తలచే వ్యక్తి ఆ భూషణం. నిజానికి సుందర్రామయ్యా, భూషణం పైకి బాగానే మాట్లాడుకొన్నా, లోపల వైషమ్యాలు గంతులేస్తూ వుండేవి. ఎప్పటికైనా భూషణాన్ని దెబ్బతియ్యాలని సుందర్రామయ్య ఆలోచిస్తూ వుండేవాడు.

X X X

ఒకరోజు హఠాత్తుగా సుందర్రామయ్యగారు కన్ను మూసారన్న వార్త దావానలంలా వూరంతా వ్యాపించింది ప్రజలంతా ఒక్కసారిగా బిగుసుకుపోయారు.

ఆయనంటే అభిమానించే ప్రజానీకం అంతా బిల బిలా ఆయన భవనంలోకి చేరిపోయారు.

నాగభూషణం కూడా అక్కడికి చేరాడు. అతన్ని చూడగానే ప్లీడరు రామనాథం, అతని దగ్గరకొచ్చి, కొన్ని కాగితాలందించాడు. అవి సుందర్రామయ్య వ్రాయించి యిచ్చిన విల్లు కాగితాలు.

వాటిని తీసి చదివిన నాగభూషణానికి మతిపోయింది. సుందరామయ్య వుండే అద్దాలమేడ నాగబూషణానికి చెందేలా వ్రాయబడింది. ఆమేడను ఎంత తక్కువైనా ఐదు లక్షలకు పైబడేవుంటుంది. బూషణానికి ఒక్కసారి పిచ్చెక్కినట్లైపోయింది. మాట రావడంలేదు. ఆ విల్లులో తన యొక్క దహన సంస్కారాలన్నీ నాగబూషణం చేతులమీదుగానే జరుగాలని ఆంక్ష విధించాడు సుందర్రామయ్య.

"ఓ! దానికేముంది సార్! అంతటి ధర్మరాజుకు అంత్యక్రియలు జరిపే అదృష్టం అందరికీ వుండవద్దూ?" అంటూ, వెంటనే మంచి గంధపు చెక్కలు తెప్పించి, బాణాసంచాతో, బాజాలతో, సుందర్రామయ్య శవాన్ని వూరేగించి

అంత్యక్రియలు పూర్తి చేశాడు నాగబూషణం.

కర్మదినం రోజున ఊళ్లోని పెద్దవాళ్ళందరికీ, వెండి గ్లాసులు ధర్మం చేశాడు కూడా. తలకొరివి కుమార్ పెట్టడం జరిగింది.

మొత్తం ఖర్చు డెబ్భైవేలదాకా తేలింది బూషణానికి. ఆ రోజునే, ఆ వూళ్లో సుందర్రామయ్యగారి కాంస్య విగ్రహం ఒకటి నెలకొల్పాలని కొంతమంది ప్రతిపాదిస్తే, వెంటనే నాగబూషణం తన వాటాగా ఓ యాభై వేలు రొఖ్ఖం మూటకట్టి విరాళం అని చెప్పి, కుమార్ చేతికి అందరి సమక్షంలో అందించాడు.

మిగతా వూరిపెద్దలు కూడా కొన్నివేలు విరాళంగా ప్రకటించి ఆ సొమ్ము కుమార్ చేతికందించారు. మొత్తం మూడు లక్షల దాకా పోగయ్యింది.

X X X

తెల్లవారింది! కుమార్ జాడ కనబడలేదు. నాగబూషణానికీ వూరి పెద్దలకీ స్పృహ తప్పినట్లయింది. వెంటనే అంతా అద్దాలమేడ దగ్గరకు పరుగెత్తారు. అప్పటికే కుమార్ పొరుగు రాష్ట్రానికి జెండా ఎత్తేశాడు.

అక్కడికి వెళ్ళగానే చిన్న కారులోంచి ఓ సేఠ్ దిగుతూ వుండటం వారి కంటబడింది. అతని వెంట ప్లీడరు రామనాథంకూడా దిగారు. వీళ్ళనందర్నీ చూడగానే రామనాథం 'అయ్యా! యీ భవనం సుందర్రామయ్యగారు యీ సేఠ్ దగ్గర ఎనిమిది లక్షలకు కుదువ పెట్టడం జరిగింది కాబట్టి, యీ బిల్డింగ్ వారసులు వచ్చి, ఆ డబ్బు చెల్లించి బిల్డింగ్ స్వాధీన పర్చుకోవచ్చు!' అంటూ ఏవో కాగితాలు చూపించాడు.

అంతే! నాగబూషణం ఒక్కసారిగా విరుచుకుపడిపోయాడు. కొంతసేపటికి పాడె సిద్ధం చెయ్యబడింది.

★

*With Best Compliments From :*

**Visit KODAIKANAL**

(The Best Health and Summer Resort of South India)

**HOLIDAY HOME**

BOARDING & LODGING

KODAIKANAL-624 101 (S. I.)

Phone : 257 Grams : "Holldayhom"

RUN THROUGHOUT THE YEAR

CUISINE : VEGETARIAN AND NON-VEGETARIAN

Please reserve rooms early to avoid disappointment

—ATHMAS